విశాలాంధ్ర గుంటూరు జిల్లా

డాక్టర్ అనుష్కకు సత్కారం

విశాలాంధ్ర-మంగళగిరి : నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్క్వాస్) గుర్తింపు పొందిన ఏపీలోనే తొలి యూపీహెచ్‌సీ అయిన కార్పొరేషన్ పరిధి గణపతినగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు సందర్శించి హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ అనుష్కకు దశ్శాలువాతో సత్కరించారు.

23న సోమేపల్లి పురస్కార ప్రధానోత్సవ సభ

విశాలాంధ్ర-గుంటూరు : రమ్య భారతి సాహిత్య త్రైమాస పత్రిక ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక పద్మావతి కళ్యాణ వేదిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణం బృందావన్ గార్డెన్స్‌లో 14వ జాతీయస్థాయి చిన్న కథల పోటీలలో అత్యుత్తమ కథా రచయితలు ఏడుగురు విజేతలకు సోమేపల్లి పురస్కార ప్రధానోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు సంపాదకులు చలపాక ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, దేవస్థానం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, న్యాయనిర్ణేత శ్రీ శ్రీ కంఠస్ఫూర్తి, పురస్కార ప్రదాత సోమేపల్లి వెంకటసుబ్బయ్య పాల్గొంటారని చెప్పారు. నగరంలోని కథా రచయితలు, సాహితీవేత్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్యాస్ ఛాంబర్ అభివృద్ధికి చెక్కు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక బొంగరాలబీడు మహాప్రస్థానంలో గ్యాస్ ఛాంబర్ నిర్మాణం అభివృద్ధి కోసం కీర్తిశేషులు ఏనుగంటి చెంచయ్య జ్ఞాపకార్థం భోగినేని రమణయ్య, చెంచు ప్రసాద్ వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు చెక్కును ధనియాల గాంధీ, పులివర్తి శ్రీనివాస్, కల్లూరు రమణయ్య, తిరువీధి రమణయ్య, ఎం.మాలకొండయ్య, జంగాలపల్లి పార్థసారథి కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ధన్యవాదాలు తెలియజేసింది.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

విశాలాంధ్ర-తాడేపల్లి : పొలకంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో చిన్నారులతో కలిసి భోజనం నాణ్యతను స్వయంగా తిని పరిశీలించారు. పిల్లలకు మెను ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించి, చిన్నారులకు చాక్లెట్లను పంచారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల్ స్వామి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజ్, మేకా వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లి : వరుణుడు కరుణించి వర్షాలు కురుస్తున్నా వ్యవసాయ పనులు ప్రారంభించలేని దుస్థితిలో తామున్నామంటూ ఉండవల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ పంట పొలాలకు ఇంకా సాగునీరు విడుదల కాకపోవటం కారణంగానే తమకు ఈ దుస్థితి ఏర్పడిందంటూ రైతులు వాపోతున్నారు. యూటీకే లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి ఉండవల్లి పంటకాలువకు సాగునీరు విడుదల చేసి రైతుల వ్యవసాయ పనులకు ఆటంకం తొలగించాలని రైతు సంఘం నేత జొన్నా శివ శంకర్ అధికారులను డిమాండ్ చేశారు.

హిందూ ఫార్మశీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మశీ కళాశాల విద్యార్థులు గుంటూరులోని 25(ఎ)బీఎన్ వారు 2023, ఫిబ్రవరి నెలలో నిర్వహించిన బీ సర్టికెట్ పరీక్షా ఫలితాలలో 17మంది, సీ సర్టిఫికెట్ పరీక్షా ఫలితాలలో 9మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వీ నాగభూషణం వెల్లడించారు. ఉత్తీర్ణులయిన విద్యార్థులకు సుబేదార్ మేజర్ విజయ్ మోహిత్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, శిక్షణ సిబ్బందికి కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అభినందనలు తెలియజేశారు. వీరందరికీ ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో ప్రాధాన్యతనిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఓఎస్‌డీ డాక్టర్ పి.సీతారామయ్య, హవల్దార్ కె.గంగాధర్, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ, లెఫ్టినెంట్ సీహెచ్ అజిత్‌బాబులు పాల్గొన్నారు.

ప్రజా సేవకే జగనన్న సురక్ష పథకం

విశాలాంధ్ర-మేడికొండూరు : మేడికొండూరులో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేడికొండూరు మండలంలోని వెలవర్తిపాడు పరిదిలో అర్హులయిన లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంభందించి సర్టిపికెట్లను అందించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. లబ్ధిదారులకు ఏ సమస్యలున్నా అధికారులు పరిష్కరించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలా ఇంటికి వచ్చి సమస్యలు తెలుసుకోలేదన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాజీ, జేసీఎస్ కన్వీనర్ షేక్ నాసర్ వలి(అబ్బాస్) తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

విశాలాంధ్ర-మంగళగిరి : సీఆర్‌డీఏ పరిధిలోని పేదలందరికీ ఇళ్ల పథకం లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలకు ఈ నెల 24న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళగిరి మండలం కృష్ణాయపాలెం లే అవుట్‌లో శంకుస్థాపన, తుళ్ళూరు మండలం వెంకటపాలెంలో నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరగుతున్నందున ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి పరిశీలించారు. కృష్ణాయపాలెం లే అవుట్‌లో ఇళ్ళ నిర్మాణాల శంకుస్థాపన పైలాన్, మోడల్ హౌస్ నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాటు పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యమంత్రి లాంఛనంగా శంకుస్థాపన చేయనున్న ప్లాట్ వద్ద, వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే ప్రాంతంలో, లబ్దిదారులకు ఇంటి మంజూరు పత్రాలు పంపిణీ కోసం ఏర్పాటు చేయాల్సిన సభ వేదిక, వీఐపీ వాహనాల పార్కింగ్, లబ్దిదారుల ప్రయాణ వాహనాల పార్కింగ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. వెంకటపాలెంలో బహిరంగ సభ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులు, బహిరంగ సభ ప్రాంగణంలో వేదిక, గ్యాలరీల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ వద్ద నిర్వహణ, సభకు హాజరయ్యే లబ్దిదారులు, ప్రజలకు సౌకర్యం కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ శివరామకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జడ్పీ సీఈవో మోహనరావు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, భూగర్భజలవనరుల శాఖ ఉప సంచాలకులు వందనం, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు, ఆర్ అండ్ బీ ఎస్ఈ ఆర్.శ్రీనివాస మూర్తి, ఉద్యానశాఖ అధికారి రవీంద్ర, వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, తహశీల్దార్లు రాంప్రసాదు, నాగిరెడ్డి, ఫణీంద్రబాబు పాల్గొన్నారు.

మహిళలపై అరాచకాల నిరోధంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాష్ట్ర టీడీపీ మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య విమర్శించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనితపై సోషల్ మీడియాలో అసభ్యపోస్టులు పెట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, నియోజకవర్గ టీడీపీ మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఎనిమిది గంటలకు ఒక మహిళపై అత్యాచారం, రోజుకు 50 మందికిపైగా మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, వేధింపులు పెరిగాయన్నారు. ఈ సంఘటనలపై తెలుగు మహిళ ప్రతినిధులు ఎక్కడికక్కడ నిలదీస్తుంటే వారిపైనే కేసులు, సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ సీఎం జగన్ భార్య భారతిపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ ఆగమేఘాలపై అరెస్టులు చేస్తున్న పోలీసులు ఇతర మహిళలను అత్యంత నీచంగా దూషిస్తూ పోస్టులు పెడుతున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీఎం జగన్‌కు మహిళలంటే గౌరవం లేదని, గత ఎన్నికలకు ముందు మహిళల కోసం ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు కనీస భద్రత లేకపోవడంపై ప్రశ్నించిన టీడీపీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనితపై సోషల్ మీడియాలో అసభ్య ప్రచారం చేయడం జగన్ రెడ్డి దిగజారుడు రాజకీయానికి పరాకాష్ట అన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ దుష్టపాలనకు చరమగీతం పాడి చంద్రబాబును మళ్లీ సీఎంగా చేసేలా మహిళలంతా కంకణం కట్టుకోవాలని కోరారు.

'జగనన్న సురక్ష' సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అర్హులైన పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదని ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారని గుంటూరు తూర్పు నియోజకవర్గ వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా అన్నారు. స్థానిక సంగడిగుంట ఐపీడీ కాలనీలో 15వ డివిజన్ కార్పొరేటర్ రామనబోయిన అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో మొత్తం 11 రకాల సర్వీసులు ఒక్క పైసా చెల్లించకుండానే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పని చేయడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 15వ డివిజన్ కార్పొరేటర్ ఆ డివిజన్ పరిధిలోని ప్రతి ఒక్కరి సమస్య తమది అనుకుని పరిష్కార దిశగా పనులు చేయడం అభినందనీయమని కొనియాడారు. మీరు వేసిన ఓట్లతోనే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఇది మీ ప్రభుత్వమని అన్నారు. అనంతరం కార్పొరేటర్ రామనబోయిన అజయ్ యాదవ్ మాట్లాడుతూ మీ సమస్యలు పరిష్కరించుకోవటానికి జగనన్న సురక్ష ఓ మంచి వేదిక అని, ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ మేయర్ షేక్.సజీల, డివిజన్ అధ్యక్షులు, వైసీపీ నాయకులు మస్తాన్ వలి, రాంబాబు, చెంచయ్య, తహ, గోపి, సుభాని, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

30న రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మోదీ దుష్ట పాలన నుంచి రైతులను, శ్రామికులను కాపాడాలని రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యతతో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దించాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ప్రజా సంఘాల జిల్లా సదస్సు జరిగింది. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అధ్యక్షత వహించగా, తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి వక్తలను వేదిక మీదకి ఆహ్వానిచారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ మోడీ విధానాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, కార్మికులకు నష్టం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పంటల బీమా పథకాన్ని నామమాత్రంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రైతు సంఘాల నాయకులు జమలయ్య, మన్నవ హరిప్రసాద్, కొల్లి రంగారెడ్డి, దదారి సుబ్బారావు, తోమాటి శివయ్య, శాస్త్రవేత్త ప్రొఫెసర్ టి.వేణుగోపాలరావు, పచ్చల శివాజీ, నక్క పోతురాజు, వేల్పూరి నరసింహారావు, జొన్న శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో ఓటును పరిశీలించుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఓటర్ల జాబితాలో మీ ఓటు ఉన్నది లేనిదీ ప్రత్యక్షంగా పరిశీలించుకోవాలని, ఓటు హక్కు కల్గి, ఓటర్ కార్డ్‌లో చిరునామా, డోర్ నంబర్ల సవరణలు ఉన్న యెడల రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 ఓటర్ల జాబితాకి సంబందించి ఈ నెల 21 నుండి ఆగస్ట్ 21 వరకు స్పెషల్ క్యాంపెయిన్‌ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో కోరారు. నగర ప్రజలు కూడా తమ ఇంటి వద్దకు ఓటర్ సమాచారం కోసం వచ్చే బిఎల్ఓలకు తగిన సమాచారం అందించి సహకరించాలని, బిఎల్ఓలకు నగరపాలక సంస్థ నుండి ప్రత్యేకంగా గుర్తింపు కార్డ్‌లను కూడా అందించామన్నారు. బిఎల్ఓలు డోర్ టు డోర్ వెళ్లే ప్రాంతాలను తేదీల వారిగా కేటాయించి, పోలింగ్ కేంద్రాలు, వార్డ్ సచివాలయాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర-తాడికొండ : ప్రజా సంక్షేమమే తమ పార్టీ ధ్యేయమని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. కంతేరు గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వారి అవసరాలను తీరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో 455 సేవలను అందించడం జరిగిందన్నారు. 14 సంవత్సరాల కాలంలో పేదల కోసం చంద్రబాబు ఏమైనా చేశారా అంటూ నిలదీశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను ఇస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి, సర్పంచ్ బి.మహేష్, బి.వెంకటేశ్వర్ రెడ్డి, సదానంద రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రగతి నగర్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రగతినగర్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. ప్రగతినగర్‌లో రోడ్ల దుస్థితిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ప్రగతి నగర్ ఏర్పాటు చేసి 14 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటికీ మౌలిక సౌకర్యాలు కల్పించడంలో నగరపాలక సంస్థ విఫలమైందని అన్నారు. నగరపాలక సంస్థ నూతన కార్యవర్గం ఏర్పడినప్పటికీ కార్పొరేషన్ ఎన్నికల కోసం రెండు సైడ్ల మట్టిని తీసి రోడ్డు వేశారు తప్ప గెలిచిన కార్పొరేటర్ ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో సీపీఐ పోరాడి విద్యుత్, మరుగుదొడ్లు, డోర్ నెంబర్లు, ఇంటి పన్ను, ఓట్లు సాధించుకుందని గుర్తుచేశారు. రోడ్ల నిర్మాణంపైన ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టలేదని, అధికార పార్టీ తమ బాధ్యతగా రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడంలో విఫలమైందని అన్నారు. ఇప్పటికైనా రోడ్లు, సైడ్ కాలువలు ఏర్పాటు చేసి ప్రగతినగర్ ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానిక శాసనసభ్యులు పైపులైను ప్రారంభం అయిందని, మెయిన్ రోడ్డు వేస్తున్నామని చెప్పినప్పటికీ అది నేటికి కార్యరూపం దాల్చలేదని అన్నారు. అలాగే ఆ ప్రాంత ప్రజలు మెయిన్ రోడ్డు బాగోలేక, అడ్డరోడ్ సరిగా లేక ఇబ్బందిపడుతున్నారని, ఇప్పటికైనా పాలకవర్గం, అధికారులు ప్రగతినగర్ రోడ్లు, కాలువ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, యేసు, తిరుమల, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ఇన్నోవేషన్స్‌కే పేటెంట్స్

విశాలాంధ్ర-గుంటూరు : సరికొత్త ఆలోచనలతో రూపొందించే ఇన్నోవేషన్స్‌కే పేటెంట్స్ దక్కుతాయని కోయంబత్తూరులోని ఇంటెల్ ఇన్నోవేటర్, నాస్‌కామ్ ప్రైమ్ అంబాసిడర్ డాక్టర్ శ్రీరామ్ క్రిస్ వాసుదేవన్ అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈ-సెల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్ అండ్ అవుట్' అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శ్రీరామ్ క్రిస్ వాసుదేవన్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సరికొత్త ఇన్నోవేషన్స్‌ను సృష్టించే విద్యార్థులు వాటిపై పేటెంట్స్‌ను పొందడం వలన దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు పేటెంట్స్‌ను సాధించడానికి ఎలా ప్రయత్నించాలో దశల వారీగా వివరించారు. అంతేకాకుండా పేటెంట్, డిజైన్, ట్రేడ్‌మార్క్, కాపీరైట్, ట్రేడ్ సీక్రెట్, ట్రెడిషనల్ నాలెడ్జ్, గ్రాడ్యుయేషన్ తర్వాత విద్యార్థులకు ఉన్న కెరీర్ ఆపర్చునిటీస్ వంటి అంశాలను విద్యార్థులకు అర్థవంతంగా వివరించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరులో విద్యార్థుల ఆధ్యాత్మిక పోటీలు

విశాలాంధ్ర-తెనాలి : ఈ నెల 30వ తేదీన ఉదయం 10గంటలకు గుంటూరు టిటిడి కళ్యాణమండపంలో ఆధ్యాత్మిక అవగాహన సదస్సు పోటీలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచారక మండలి సభ్యులు తిరుక్కోవ ఈశ్వార్ బసవయ్య చెప్పారు. తెనాలిలో గురువారం వినాయక దేవస్థానంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ధార్మిక సాంస్కృతిక పరిరక్షణకు కృషి చేయాలని ఆ నేపథ్యంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక అవగాహన సదస్సు తదనంతరం పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేసి ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొని ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బసవయ్య చెప్పారు.

చంద్రబాబు నిర్ణయంపై ముస్లింల హర్షం

విశాలాంధ్ర-తాడికొండ : కేంద్ర ప్రభుత్వం తెరమీదకు తీసుకువచ్చిన యూనిఫాం సివిల్ కోడ్ బిల్లును టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యతిరేకించడం పట్ల ముస్లింలు గురువారం హర్షం ప్రకటించారు. లోక్‌సభలో, రాజ్యసభలో సైతం ఈ బిల్లుకు వ్యతిరేకంగా టీడీపీ పోరాడుతుందని చంద్రబాబు గొప్ప నిర్ణయం తీసుకున్నాడని బాబు తీరును కొనియాడారు. హర్షం ప్రకటించిన వారిలో గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి షేక్ రిజ్వానా జిలాని, షేక్ పర్వేజ్, షేక్ ఇబ్రహీం ఉన్నారు.

నూతన సచివాలయ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-తెనాలి : కొలకలూరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సిపి ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండి అన్నిరంగాల్లో సహాయసహకారాలు అందిస్తుందని చెప్పారు. ఎన్నడూ లేని విధంగా వాలంటీర్లను ఏర్పాటు చేసి తద్వారా ఇంటింటికి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగకుండా మంచి ఏర్పాట్లు చేశారని చెప్పారు. అదే విధంగా తెనాలి పట్టణ 7,8 వార్డుల పరిధిలోని సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమం క్యాంపు ఏర్పాటు చేసి కుల, ఆదాయ ఇతర సర్టిఫికెట్లను దరఖాస్తు చేసుకున్న వారికి అందజేశారు. తెనాలి, గంగానమ్మపేటలోని రైతు బజార్‌లో ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన బియ్యం అందించే స్టోర్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ, తెనాలి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-తుళ్లూరు : వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం తుళ్లూరు తహాశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు ధర్నా చేశారు. వీరి ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ వీఆర్‌ఏలకు తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్న విధంగా ఏపీలో కూడా పే స్కేల్ అమలు చేయాలని, అర్హత కలిగిన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. తుళ్లూరు మండల వీఆర్‌ఏలకు రెండు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాన్ని వెంటనే చెల్లించాలని, వీఆర్‌ఏలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరపాలని డిమాండ్ చేశారు. తుళ్లూరు తహాశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వీఆర్‌ఏలు అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే ఆదాం, షఫీ, కె.రమ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అమలు చేస్తున్న స్త్రీ శక్తి ద్వారా నియోజకవర్గంలోని మహిళల స్వయం ఉపాధికి ఊతం ఏర్పడుతుందని నియోజకవర్గ టీడీపీ మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి అన్నారు. స్త్రీ శక్తిలో భాగంగా 18వ బ్యాచ్‌లో మంగళగిరి పట్టణం, మండలానికి చెందిన 45 మంది మహిళలు 60 రోజులపాటు శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరికి మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో గురువారం సర్టిఫికెట్లు, ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ 18 బ్యాచ్‌లు ద్వారా ఇప్పటివరకు 720 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి, జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్లను నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తమ్మిశెట్టి జానకీదేవి, ఆకుల జయసత్య, మంచికలపూడి వైష్ణవి, ఊట్ల దుర్గామల్లేశ్వరి, దివి లక్ష్మి, చిలకలపూడి అప్పలమ్మ పాల్గొన్నారు.

23న సింహగర్జన సభ, రాజకీయ పార్టీ ఆవిర్భావం

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా గల ప్రాంగణంలో ఈ నెల 23న జరుగనున్న సింహగర్జన సభ రాజకీయ పార్టీ ఆవిర్భావం ఏర్పాట్లను రామచంద్ర యాదవ్, పార్టీ నాయకులు పర్యవేక్షించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీలు, బీసీ, ఎస్టీ, ఎస్సీలను, ఓటు బ్యాంకు రాజకీయాలుగా చూస్తున్నాయని, వాడుకొని అధికారాన్ని కుటుంబ పార్టీలు అనుభవిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించే దిశగా నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావం ఉంటుందని, ఆదివారం జరగబోయే సన్నాహక సమావేశం భవిష్యత్తు రాజకీయాలను ప్రభావితం చేసేది లాగా ఉందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అన్ని జిల్లాల నుంచి పెద్దఎత్తున ప్రజలు హాజరుకానున్నారని, రాబోయే ఎన్నికలలో ఈ నూతన పార్టీ ప్రభావశీలంగా పనిచేస్తుందని తెలిపారు.

నేతన్న విగ్రహం, జాతీయ పతాకం ఏర్పాటు

విశాలాంధ్ర-మంగళగిరి : చేనేత రంగానికి ప్రసిద్ధి చెందిన మంగళగిరి ప్రాంతంలో నేతన్న విగ్రహం ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. మంగళగిరి నగరంలోని ఎన్నారై వై జంక్షన్ వద్ద నేతన్న విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే గురువారం పరిశీలించారు. విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశంలో భారీ జాతీయ పతాకం కూడా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచన చేశారు. ఆగస్టు 15వ తేదీన జాతీయ పతాకం ఆవిష్కరణతో పాటు నేతన్న విగ్రహావిష్కరణ కూడా చేయటానికి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచనలు చేశారు.

మానవత్వం చాటుకున్న వల్లభనేని

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి సీతానగరం బోర్డ్ యార్డు మలుపు దగ్గర అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఓ ప్రైవేట్ సెక్యూరిటీకి చెందిన వాహనం ఢీకొట్టింది. గాయలైన వ్యక్తి సీతానగరంకు చెందిన వ్యక్తిని టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, ఆటోలో ఎక్కించి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ప్రముఖ కథా రచయితకు అవగాహన సంస్థ నివాళి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రముఖ కథకుడు, హాస్య, వ్యంగ్య రచయిత, సాహిత్య, కళారంగాల్లో ప్రసిద్ధులైన శ్రీరమణ మృతికి అవగాహన సంస్థ సంతాపం తెలియజేస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాహితీ ప్రపంచానికి సుపరిచితులైన శ్రీరమణ అనేక పత్రికల్లో పేరడీలు, శ్రీకాలమ్, శ్రీఛానల్, చిలకల పందిరి, హాస్యజ్యోతి, మొగలి రేకులు వంటి ఎన్నో శీర్షికలు నిర్వహించి అందరి అభిమానం పొందారన్నారు. ఎన్నో సాంప్రదాయ కుటుంబాల కథ మిధునంతో శ్రీరమణకి మంచి పేరు వచ్చిందని, ఆ మిధునం కథ సినిమాగా వచ్చి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకుందని పేర్కొన్నారు. బాపూ, రమణ వంటి దిగ్గజాలతో కలిసి పని చేసిన అనుభవం శ్రీరమణ ఎంతగానో ప్రసిద్ధి చెందారని కొనియాడారు.

అవినాష్ గుప్తాకు కఠిన శిక్ష విధించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : గిరిరాజు శశి, కోటం ఆనంద్‌లపై అతి పైశాచికంగా వ్యవహరించి చిత్రహింసలకు గురిచేసిన అవినాష్ గుప్తాకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని వస్త్ర ఉత్పత్తిదారులు డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలోని ఆలయ సిల్క్స్ షోరూం వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అవినాష్ గుప్తా ఆస్తులు జప్తు చేసి పరువు నష్టం కింద కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, తమకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించేవిదంగా చర్యలు తీసుకోవాలని నిరసన ధర్నా నిర్వహించారు. ధర్మవరం నుంచి విజయవాడ వచ్చి నిరసన తెలియజేస్తున్న చేనేత పట్టు వస్త్ర ఉత్పత్తిదారులకు మంగళగిరి చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. తక్షణం అవినాష్ గుప్తాకు కఠినమైన శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్తులు జప్తు చేసి బాధితులకు మిగిలిన 19 మంది వస్త్ర వ్యాపారులకు బకాయిలు చెల్లించాలని చేనేత కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, చేనేత కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామనాథం పూర్ణచంద్రరావు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు కూరపాటి కోటేశ్వరరావు, ఏరియా చేనేత కార్మిక సంఘం నేత కౌతరపు వెంకటేశ్వరరావు, కోస్తాంధ్ర పద్మశాలి సంఘం చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి కారంపూడి అంకమ్మరావు, హైకోర్టు న్యాయవాది చేనేత ఉద్యమ నాయకులు యంగల కోటేశ్వరరావు(వైకె), వీవర్స్ ఫెడరేషన్ నేత బండారు ఆనందప్రసాద్, రాష్ట్ర వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు బి.మల్లేష్, కార్యదర్శి శ్రీనివాస్ ప్రసాద్, గిరిరాజు రవి, గిరిరాజు నగేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్‌లను నిషేధించండి

విశాలాంధ్ర-గుంటూరు : ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్, లివింగ్, ఫ్రెండ్‌షిప్, వివిధ యాప్స్‌ని నిషేధించాలని కోరుతూ గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ సాంకేతిక పరంగా అభివృద్ధి చెందుతున్న సందర్భంలో ఆన్‌లైన్ యాప్స్ వలన చాలామంది అమాయక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, బెట్టింగ్ యాప్స్ వలన లక్షల మంది యువత క్రికెట్ రమ్మి ఇతర ఆటలకు బెట్టింగ్‌లు పెట్టి ఆర్థికంగా నష్టపోవడంతో పాటు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. లివింగ్ యాప్ పేరుతో యువతను ప్రధానంగా ఆకర్షించి వీడియోకాల్స్‌లో రికార్డ్ చేసుకుని బ్లాక్ మెయిల్ చేస్తూ లక్షలాది రూపాయలు ఘరానా మోసగాళ్లు ఆర్థిక దోపిడికి పాల్పడుతున్నారు. ఒంటరిగా ఉన్నారా మీతో ఫ్రెండ్‌షిప్ చేస్తామని ఫ్రెండ్స్ యాప్ ద్వారా పరిచయాలు పెట్టుకొని ఆ పరిచయాలను ఆర్థికంగా ఉపయోగించుకుంటూ డబ్బులు ఇవ్వకపోతే మీ ఫ్రెండ్స్‌కి అశ్లీలతో కూడిన మార్ఫింగ్ ఫోటోలు పంపుతామని బ్లాక్‌మెయిల్ చేస్తూ ఆర్థిక దోపిడికి పాల్పడుతున్న ముఠాలు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మీకు లింకు పంపుతున్నాము ఓపెన్ చేస్తే మీకు కొంత మొత్తం నగదు వస్తుందని ఆశ చూపి తమ అకౌంట్‌లో ఉన్న మొత్తం డబ్బుల్ని లాగేస్తున్నారన్నారు. ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర మానసిక ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఆయా యాప్‌ల వలన రాష్ట్రంలో ఇప్పటికే చాలామంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చించి యాప్‌లను నిషేధించడంతోపాటు ప్రజల్లో ఆ యాప్‌ల వలన నష్టాలపై అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. యాప్ లను నిషేధించకుంటే మరింత పోరాటాలకు పూనుకుంటామని హెచ్చరించారు. జడ ఉమాశంకర్, షేక్ సైదా, షేక్ కబీర్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటి, నల్లచెరువు 22/2వ లైను, డోరు నెం.81-23-2239రు కాపురస్తులు **ముప్పసాని శ్రీనివాసరావు గారి కుమార్తె ముప్పసాని హరిత (సెల్ : 83416 53100)** అను నేను నా పేరిట గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. **V9886436** ను గుంటూరు బస్టాండ్ నుండి ఇంటికి ఆటోలో వస్తుండగా సదరు పాస్‌పోర్ట్ ఉన్న బ్యాగ్ పోయినది. సదరు పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటి, రాజ గోపాల నగర్ 5వ లైను, అల్ సత్తార్ మసీదు రోడ్డు, డోరు నెం.8-16-79/ఏ కాపురస్తులు **లేటు సయ్యద్ నజీర్ అహ్మద్ గారి కుమారుడు సయ్యద్ మహబూబ్ అహ్మద్ (సెల్ : 9866334822)** అను నేను నా పేరిట గల గడువు ముగిసిన పాత పాస్‌పోర్ట్ నెం. **A2697218** ఒరిజినల్‌ను **ది.05-07-2023**న గుంటూరు ఆర్‌టిసి బస్టాండ్ బయట జిరాక్సు సెంటర్ వద్ద పోగొట్టుకున్నాను. సదరు పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

బహిరంగ ప్రకటన

గుంటూరు సిటి, పోస్టల్ కాలని 4వ లైను, కాపురస్తులు దమ్ము రత్నకిరణ్ గారి భార్య బోరుగడ్డ వత్సలాదేవి గారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

నేను జిరాక్స్ కాపీలు తీయించడానికి నా ఇంటికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లతో కూడిన బ్యాగుతో నా ద్విచక్ర వాహనముపై నా నివాసము నుండి అరండల్‌పేట వైపు వెళ్ళుచుండగా ఒరిజినల్ డాక్యుమెంట్లతో కూడిన బ్యాగు పోగొట్టుకున్నాను, పోయిన బ్యాగులో మా అత్తగారైన దమ్ము సరోజిని, భర్త: దమ్ము వెంకటేశ్వర్లు పేరున గల ది.06-10-1980 నాటి డాక్యుమెంట్ నెం.6710/1980 మరియు ది.26-03-1980 నాటి ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.1711/1980, ది.04-01-1963 నాటి ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.45/1963 ఉన్నాయి. సదరు డాక్యుమెంట్‌లు ఎవరికైననూ దొరికిన యెడల ఈ దిగువ చిరునామాను సంప్రదించగలరు.

జె.చంద్రశేఖర్, అడ్వకేట్,
హెచ్.నెం.4-15-38/2బి, 1వ లైను పోస్టల్ కాలని,
గుంటూరు, సెల్: 9849797079

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

తొలగించిన ఓట్ల వివరాలు సేకరించండి

విశాలాంధ్ర-పెదకూరపాడు : రానున్న ఎన్నికల్లో అక్రమ పద్ధతుల్లో గెలవాలని ఆలోచనతో వైసీపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని టీడీపీ మద్దతుదారుల ఓట్లను తొలగిస్తున్నారని క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. గురువారం నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడులో బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు మండలాల బూత్ కన్వీనర్లతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటర్ జాబితా ఆధారంగా తొలగించిన ఓట్లను గుర్తించి దానిని అధికారులు చూపిన కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల న్నారు. అర్హులైన కొత్త ఓటర్లను చేర్పించాలన్నారు. సాధారణ ఎన్నికలకు ఎదుర్కోవడానికి పార్టీ శ్రేణులు సమాయత్వం కావాలని సూచించారు. మండలాల పార్టీ అధ్యక్షులు కొండలు, నందిగం ఆశీర్వాదం, భాష, శిక్షకులు రమేషు, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-రాజుపాలెం : క్రియాశీలక కిట్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలం లోని రాజుపాలెంలో మండల ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ కార్యకర్తల కుటుంబ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి శిరిగిరి శ్రీనివాసరావు, సత్తెనపల్లి పట్టణ నాయకులు రాడ్ల శ్రీనివాసరావు, సిరిగిరి మణికంఠ, మండల ఉపాధ్యక్షులు పసుపులేటి వెంకటస్వామి, అంచుల అనేష, ఉపాధ్యక్షుడు కేదార రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి కేంద్రాల్లో సైకిళ్లు పంపిణీ

విశాలాంధ్ర-కారంపూడి: పట్టణంలోని 7 అంగన్‌వాడి కేంద్రాలో సైకిళ్లను తహశీల్దార్ జి.శ్రీనివాస్ గురువారం పంపిణి చేసినట్లు సూపర్‌వైజర్ ఓ అనంత లక్ష్మీ తెలిపారు. వయస్సుకు తగ్గ ఎత్తు లేని పిల్లల ఎదుగుదల కోసం ఈ సైకిళ్ల ఉపయోగపడతాయన్నారు. రోజు వారి చర్యలలో చిన్నారులను సైకిలింగ్ చేయిస్తారన్నారు. దళితవాడ అంగన్‌వాడి కేంద్రం వద్ద పిచ్చిచెట్లు ఎక్కువగా ఉండటంతో పాములు సంచరిస్తున్నాయని తహశీల్దార్‌కు తెలియజేశామన్నారు. స్పందించిన తహశీల్దార్ దగ్గర ఉండి పిచ్చి చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. అంగన్‌వాడి కేంద్రాలకు సహాయసహకారాలు అందిస్తున్న తహశీల్దార్‌కు అంగన్‌వాడి కేంద్ర కార్యకర్తలు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు.

జి.వి.గారు ఈ నేతల విగ్రహాల కు పిచ్చి కంపనుండి విముక్తి కల్పించండి....

ముళ్లకంపల్లోనే ప్రముఖుల విగ్రహాలు

విశాలాంధ్ర-వినుకొండ: ఎంతో ప్రజాదరణ పొంది ప్రజల మనసులో నిలిచిపోయిన ఇరువురు నేతల విగ్రహాలు నేడు మూళ్లకంపలో పడి ఉన్నాయి, ఈ విగ్రహాలు ఒకటి మాజీ ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు. మరొకటి మాజీమంత్రి పరిటాల రవిది. తొలుతగా ఈ రెండు విగ్రహాలు స్థానిక కారంపూడి రోడ్‌లోని ఎన్ఎస్పీ కాల్వపై టిడిపి వారు ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు అక్కడ వర్ధంతి సభలతో పాటు భారీ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కాగా మూడేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆ విగ్రహాలు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా ఎన్ఎస్పి కాలువపై నిర్మించారంటూ అధికార పార్టీ ఒత్తిడితో తొలగించాలంటూ సూచించారు. అయితే టిడిపి వారు తాము విగ్రహాలను తొలగించమంటూ భీష్మించారు. దీంతో అధికారులు పోలీసు యంత్రాంగంతో ఒక రాత్రివేళ ఉద్రిక్తత మధ్య ఆ రెండు విగ్రహాలను తొలగించి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పడేశారు. మూడేళ్లుగా ప్రజాప్రతినిధుల విగ్రహాలు పిచ్చి కంపలో ఉండడాన్ని ప్రజలు చూస్తూ జాలి చూపిస్తున్నారు. అయితే అధికారులు ఆ విగ్రహాలను తీసుకెళ్లి మరొక చోట ఏర్పాటు చేసుకోవాలని టిడిపి కోరినప్పటికీ వారు మౌనం వహించినట్లు తెలిసింది. ఇప్పటికైనా ఆ విగ్రహాలను పిచ్చి కంపలోనుంచి విముక్తి కల్పించాలని ఆ ప్రజానేతల అభిమానులు కోరుతున్నారు.

గ్రామీణ ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-బొల్లాపల్లి : గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ సేవలను పేదల ఇళ్ల వద్దకు చేర్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని తహశీల్దార్ అచ్యుత వెంకట సుధాకర్ అన్నారు. మండలంలోని కనుమలచెరువు సచివాలయం ఆవరణలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహశీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నామని అర్హత కలిగిన ఏ ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కారాదన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ శ్రీను నాయక్, ఎంపీటీసీ పసరం నాయక్ భూక్యా ప్రశాంత్ నాయక్, వైసీపీ మండల పార్టీ కన్వీనర్ రాజయ్య, మండల వైసీపీ నాయకులు బత్తిన గురవయ్య, కృష్ణ నాయక్‌లతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సర్పంచులు, సచివాలయ అధికారులు, హాథిరాం నాయక్, లక్ష్మ నాయక్, హుస్సేన్, సాయి, కోటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోలగుట్లలో బ్రహ్మారెడ్డి పర్యటన



విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని కోలగుట్ల గ్రామంలో టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరచాలని శ్రేణులకు సూచించారు. తొలుత ఆయన పార్టీ నాయకులు ఏసుబోయిన కొండలు కుమార్తె శ్రావణ పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగును పరిశీలించిన ఇరిగేషన్ డీఈ

విశాలాంధ్ర-తాడేపల్లి : గుంటూరు కాలువలో కలుస్తున్న ఉండవల్లి సెంటర్ డ్రైనేజ్‌తో పాటు, కాలువ వెంబడి నులకపేట పలు ప్రాంతాలను గురువారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. గుంటూరు కాలువలో డ్రైనేజ్ వాటర్ కలువకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్లు ఇరిగేషన్ డీఈ కృష్ణ తెలిపారు.

సీఆర్ స్ఫూర్తితో.. పార్టీని బలోపేతం చేయాలి..

సంస్మరణ సభలో జంగాల

విశాలాంధ్ర-చిలకలూరిపేట : అమరవీరుడు సీఆర్ మోహన్ ఆశయాలను కొనసాగిస్తూ, పార్టీని బలోపేతం చేయటమే ఆయనకు అర్పించే ఘన నివాళి అని సీపీఐ రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, పోరాట యోధుడు సీఆర్ మోహన్ రెండో సంస్మరణ సభ గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా సీఆర్ మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సభకు సీపీఐ ఏరియా కార్యదర్శి నాగ బైరు రామసుబ్బాయమ్మ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన జంగాల మాట్లాడుతూ సీఆర్ మోహన రావు నుంచి స్ఫూర్తి పొందాలని, అనారోగ్యం బాగా లేక పోయినా పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమంలోనూ ఆయన పాల్గొనే వారని గుర్తుచేసుకున్నారు. నిబద్ధత కలి గిన రాజకీయ నాయకుడిగా చివరివరకు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కమ్యూని స్టుగా బతకడం, కమ్యూనిస్టుగా చనిపోవడం కొంతమం దికే సాధ్యమౌతుందని, అటువంటి వారిలో సీఆర్ ఒకరని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు ఆయన బాసటగా నిలిచారని, అఖిల పక్ష రాజకీయ, ప్రజాసంఘాల ఐక్య తతో అనేక సమస్యలు సాధించారని తెలిపారు. నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే వారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఆర్ జీవితంలో జరిగిన ఓ సంఘటనను ప్రస్తావిస్తూ ప్రజా నాట్యమండలి నాటకం ప్రదర్శన ఉన్న సమయంలో తన భార్య చనిపోయినా, నాటకం ఆగకుండా పూర్తి చేశారని, పార్టీ కోసం, ప్రజల కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్ర సాద్ మాట్లాడుతూ ప్రజలతో మమేకమైన ప్రజా నాయ కుడు సీఆర్ అని కొనియాడారు. నిరంతరం పేదలు, కార్మికుల కోసం, ముఖ్యంగా పారిశుధ్య కార్మి కుల కోసం జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. తాను నమ్మిన విలువల కోసం పాటు పడ్డారని, జీవితం చివరి వరకు పార్టీ అభ్యు న్నతి కోసం కృషి చేశారని వివరించారు. ఈ సందర్భంగా గేయాన్ని ఆలపించి సీఆర్‌కు జోహార్లు అర్పించారు. ప్రజా నాట్యమండలి జాతీయ కార్యదర్శి షేక్ గని ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, పల్నాడు జిల్లా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి బాబురావు, రాము, ఏఐవై ఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు పేలూరి రామారావు, దాసరి వరహాలు, ఏపీ మహిళా సంఘం ఏరియా కార్య దర్శి చెరుకుపల్లి నిర్మల, ప్రజా నాట్యమం డలి జిల్లా అధ్య క్షుడు ఎం.రవీంద్ర, ఎమ్మార్పీఎస్ నాయ కుడు అడపా మోహన్, నాయకులు కందిమళ్ల వెంకటే శ్వర్లు, తుబాటి సుభాని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సీఆర్ సన్నిహితులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో వలంటీర్లను వినియోగించొద్దు

విశాలాంధ్ర-నరసరావుపేట : ఎన్నికల విధులలో వలంటీర్ల సేవలు వినియోగించరాదని అలా వినియోగించుకొన్న బూత్ లెవెల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివ శంకర్ లోతేటి అన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయములోని బీఆర్ అంబేద్కర్ స్పందన హాలులో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులపై జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురు వారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీపై వివరాల సేకరణకు ఈ నెల 21వ తేది నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తారని, పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్ ప్రక్రియ వంటివి ఆగష్టు 22వ తేది నుంచి ఆగష్టు 29 వరకు నిర్వహించడం జరుగుతుం దని, సప్లిమెంట్ తయారీ సెప్టెంబర్ 30 నుంచి అక్టోబరు 16 వరకు 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్ నిర్వహిస్తారని తెలిపారు. క్లైములు ఫైలింగ్, అభ్యంతరాలను అక్టోబరు 17 నుంచి నవంబర్ 31 వరకు, ప్రత్యేక క్యాంపెయిన్‌లు తేదీలు ఆగష్టు 28, 29, సెప్టెంబర్ 18, 19 తేదీలలో ఉంటాయన్నారు. డిసెంబర్ 26న క్లైముల డిస్పోసల్, అభ్యంతరాలు, డేటా బేస్ అప్డేషన్, ప్రింటింగ్ అఫ్ సప్లిమెంట్ 2024 జనవరి 1న తుది ఓటర్ల జాబితా పబ్లికేషన్ 2024 జనవరి 5న నిర్వహిస్తారన్నారు. జిల్లాలో రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారిని గుర్తించి ఆయా ఇద్దరు ఈఆర్‌ఓలు పరస్పరము చర్చించుకొని అభ్యర్థి అభ్యర్ధన మేరకు ఒక చోట ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీలు బూతుల వారీగా బూత్ లెవెల్ ఏజంట్‌లను నియమించి ఓటరు లిస్టు సవరణలో తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రతి 15 రోజులకొక సారి ఓటరు జాబితాలను సంబంధిత సచివాలయములో, పంచాయతి ఆఫీసులలో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా రెవిన్యు అధికారి వినాయకం, నియోజికవర్గ ఎలెక్టోరల్ అధికారులు, రెవిన్యూ డివిజినల్ అధికారులు రాజకుమారి, శేషిరెడ్డి, అద్దేయ్య, డీఎఫ్ఓ రామచంద్ర, వసంత బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే స్వచ్ఛభారత్ కార్మికులకు గత సంవత్సరం నుంచి జీతాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారంటూ శివయ్య స్తూపం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కాసా రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ పేరుమీద పారిశుద్ధ కార్మికులను పదివేల రూపాయలు జీతాలు ఇస్తామని నియమించుకుని 6వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. అది కూడా సంవత్సరాలు పాటు జీతాలు ఇవ్వకుండా పనులు చేపించ్చటం ఎంతవరకు సబమని వెంటనే పెండింగ్లో ఉన్న జీతాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 2021 జనవరి 26వ తారీఖున పారిశుద్ధ కార్మికులకు పదివేల రూపాయలు ఇవ్వాలని జీవో చేశారని, కానీ జీవోని ఇంప్లిమెంట్ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. వారి కష్టాలు ప్రభుత్వానికి కనపడట్లేదని అలాగే వారికి రావలసిన యూనిఫామ్, చెప్పులు, కొబ్బరి నూనె, బెల్లం కూడా ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గ్రామీణ ప్రాంతంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు సంవత్సరాలు పాటు జీతాలు లేకుండా కుటుంబాలు గడవక హాస్పిటల్‌కి వెళ్లాలన్న రూపాయి దొరక్క ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సర్పంచి, సచివాలయం సెక్రటరీ, ఎంపీడీవోలను జీతాలు ఇప్పించండి ఇబ్బందులు పడుతున్నామని అడిగితే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సర్పంచులు ప్రభుత్వం నుంచి డబ్బులు రావట్లేదు మా ఖజానాల్లో డబ్బులు లేవు కాబట్టి మీరు చేస్తే చేయండి లేకపోతే మానుకోండి అని కార్మికులు పట్టించుకోవట్లేదని వెంటనే ప్రభుత్వం స్పందించి స్వచ్ఛభారత్ కార్మికులను ఆదుకోవాలని లేకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా బూదాల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అప్ప రాజు పవన్, బూదాల సాగర్, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, కొప్పెరపు మల్లికార్జున, స్వచ్ఛభారత్ కార్మికులు మల్లేశ్వరరావు, దయామని, జీవరత్నం, ఆనందు, సువార్తమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

విశాలాంధ్ర-రాజుపాలెం : చిన్న, సన్న కారు రైతులు ప్రకృతి, సేంద్రీయ వ్యవ సాయం వైపు మనసు పెట్టాలని, అప రాలు పంటలు వేయాలని రైతులు, కౌలు రైతులు, మహిళా రైతులకు రిసోర్స్ సెంటర్ గుంటూరు పల్నాడు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. గురువారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో చిన్న, సన్న కారు రైతులకు అవగాహన సదస్సు రాజుపాలెం మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించటం జరిగింది. సదస్సుకి డీబీఆర్సీ రాజుపాలెం మండల ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపతి కోటిరత్నం అధ్యక్షత వహించారు. చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులు, కౌలు రైతులు ప్రభుత్వం పంట సాగుదారుల చట్టం ద్వారా ఇస్తున్న సీసీఆర్సీ కార్డులు పొంది ప్రభుత్వం ద్వారా వస్తున్న రైతు భరోసా, బ్యాంక్ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, పురుగుమందులు, సబ్సిడీపై పొందేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులు, కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండల ఏపీఎం సునీత ్లాడుతూ రైతులు పంటలు మార్పు చేయడానికి భూసార పరీక్షలు చాలా అవసరమని, భూసార పరీక్షలు చేయించుకొని మీ పొలాల్లో పంటలు వేసినట్లయితే అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వర్లు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు, కౌలు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-బెల్లంకొండ : ప్రజల కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీవో వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చినప్పుడు నుంచి సచివాలయ సిబ్బంది వలంటీర్లు మీ ఇళ్ల వద్దకు వచ్చి సమస్యలను తెలుసుకొని పరిశీలించడం జరుగుతుందని ప్రభుత్వం చేపట్టిన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందజేస్తున్నామని సాధారణంగా కుల ఆదాయ కుటుంబ రేషన్ కార్డు విభజన వంటి ధ్రువీకరణ పత్రాలు సద్వినియోగం చేసుకోవాలని గతంలో ఏ సర్టిఫికెట్ తీసుకోవాలన్న రోజుల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండేదని ప్రజల కష్టాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం

విశాలాంధ్ర-అచ్చంపేట : పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ఆదేశానుసారం అచ్చంపేట మండల కేంద్రంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మినీ మేనిఫెస్టో ప్రచారం నిర్వహించారు. ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు, రాయుడి విశ్వేశ్వరరావు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి వివరిస్తూ మహాశక్తి, తల్లికి వందనం, దీపం పథకం, ఉచిత బస్సు సౌకర్యం, ఇంటింటికి మంచినీరు పథకం, అన్నదాత పథకం, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు పేదలను సంపన్నులుగా చేయటమే తెలుగుదేశం పార్టీ ధ్యేయంగా ప్రతి మహిళను చైతన్యవంతులు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వేగుంట రాణి, గంగినేని లీలావతి, చల్ల అనుపకళ, ఊరే సరోజిని, సరిపూడి కృష్ణకుమారి, నుంసావత్ నాగ మణి బాయ్, పసుపులేటి తిరుపతమ్మ, పద్మలత, షేక్ నజమా, తిరుమలపల్లి పెరు మాళ్ళపల్లి సుహాసిని, నందిగం ఆశీర్వాదం, తాళ్లూరి సుబ్బారావు, కూకట్‌పల్లి అయ్య ప్పరాజు, తిరువాయిపాటి ఆంజనేయులు, చిమట శ్రీనివాసరావు, రాయుడు సుబ్బా రావు, కోట చంటి, మేకల వెంకట్రావు, సందెపోగు వెంకట్రావు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ కార్యాలయంలో బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించినట్లు రీజినల్ మేనేజర్ ఎంపీ శేషగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయాన్నే బ్యాంక్ సిబ్బంది గుంటూరు నగరంలో వాకథాన్ నిర్వహించారు. అలాగే రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ మేనేజర్ ఎంపీ శేషగిరి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ వెంకట్ జైని, బ్యాంక్ ఉన్నతాధికారులు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను విజయవాడలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో కలిసి తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఏపీ సచివాలయానికి 20 ట్రాఫిక్ బారికేడ్లను సమర్పించారు. అలాగే వెయ్యి పర్యావరణ హితమైన గుడ్డ సంచులను గుంటూరు, పరిసర ప్రాంతాలలో పంపిణీ చేశారు.

పది విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర, తెనాలి : రిటైర్డ్ ఉపాధ్యాయిని కీ.శే.మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి, తెనాలి ఆధ్వర్యంలో గురువారం విజయలక్ష్మి స్మారక పురస్కార ప్రధానోత్సవం శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రం హాలులో జరిగింది. 10వ తరగతిలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు, జ్ఞాపిక బహుమతులను తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆమె భర్త మొవ్వా సత్యనారాయణ అందజేశారు. తెనాలి పట్టణ ఛైర్‌పర్సన్ ఖాలేదా నసీం, వైస్ ఛైర్మన్ హరిప్రసాదరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా జగనన్న సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-నరసరావుపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా చేసుకుని ఆ దిశగా ఆలోచిస్తున్నాయని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో గురు వారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంలో భాగంగా రాష్ట్రంలో 1.17 కోట్ల కుటుంబాలకు గాను 57.3 లక్షల సర్టిఫికెట్లను అందజేశామన్నారు. గత ప్రభు త్వంలో ప్రజలకు ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సులు, లంచాలు ఇవ్వాల్సి వచ్చేది అన్నారు. జగనన్న సురక్ష పథకాన్ని రాష్ట్ర ప్రజలు అభినందిస్తున్నారని అన్నారు. పేదల సంక్షేమే లక్ష్యంగా, వారికి న్యాయం చేసేందుకు ఈ పథకం అమలు చేస్తున్నామన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకానికి రాష్ట్రవ్యాప్తంగా స్పందన లభిస్తుందని అన్నారు. వలంటీర్లు గడపగడపకు వెళ్లి 11 రకాల సేవలను అందిస్తున్నారని అన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు 11,556 సర్టిఫికెట్లు అందజేశామన్నారు. పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా వలంటీర్లపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని అన్నారు. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, జంగా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి లాప్‌టాప్ అందజేత

విశాలాంధ్ర-పెదకూరపాడు : గ్రామానికి చెందిన మూడో సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థి వెంకట నాగ జస్వంత్ చదువు అవసరాల నిమిత్తం ఎన్ఆర్ఐ భాను ప్రకాష్ మాగులూరి సహకారంతో లాప్‌టాప్ అందించారని అర్తిమల్ల రమేష్ అన్నారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ మాగులూరి ఫౌండేషన్ సేవలు మరువలేమని, గత మూడు సంవత్సరాల నుంచి పెదకూరపాడు, సత్తనపల్లి నియోజకవర్గాలను కుల, మతాలు, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు వలస కూలీలకు అన్నదాన కార్యక్రమం, ఆర్థికంగా రైతులకు విత్తనాలు, చదువుకునే పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, బీటెక్, ఎంటెక్ చేసి విద్యార్థులకు లాప్‌టాప్‌లు పంపిణీ చేయడం జరిగిందని భానుప్రకాష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ గోపాలరావు, ఫౌండేషన్ చైర్మన్ మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాదు, కుంచనపల్లి కిరణ్ కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు, బలుసుపాడు, కాశిపాడు గ్రామాలలోని నర్సరీలను బుధవారం పెదకూరపాడు ఉద్యాన శాఖ అధికారి శ్రీ నిత్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీ నిర్వాకులు 2010 చట్టం ప్రకారం నర్సరీ లైసెన్సు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. యజమానులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలన్నారు. ముఖ్యంగా లైసెన్సు లేకుండా నర్సరీ ఏర్పాటు చేస్తున్న యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాసిరకం నారు అందించినయెడల అటువంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

అవినీతిరహిత సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థ

విశాలాంధ్ర-గుంటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ అవినీతికి తావు లేని సేవలు అందిస్తుందని రాజ్యసభ మాజీ సభ్యులు యలమంచిలి శివాజీ అన్నారు. సీఆర్ మీడియా అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు గురువారం గుంటూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై ముచ్చటించుకున్నారు. పరిపాలన ప్రజలకు చేరువ కావడం ద్వారా సేవలు సత్వరమే అందే అవకాశం వలంటీర్ల వ్యవస్థ కల్పిస్తోందని శివాజీ అన్నారు. సుమారు 2 లక్షల మందికి ఈ వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు కల్పించడం మంచి పరిణామమని అన్నారు. కృష్ణా జిల్లాలో తమ స్వగ్రామం కనుమూరులో తమ తండ్రి జ్ఞాపకార్థం గ్రామ సచివాలయ భవనం నిర్మించామని శివాజీ తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు నిర్మించిన ఘనత వైఎస్ రాజశేఖర రెడ్డికే చెందుతుందని అన్నారు. ఆ ప్రాజెక్టు నిర్మాణం కోసం తాము చేసిన కృషిని ఆయన గుర్తుచేసుకున్నారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి చూపిన చొరవను ఆయన గుర్తుచేసుకున్నారు. బందరు పోర్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఛైర్మన్ వెంట ఓఎస్‌డీ శ్రీనివాస జీవన్, కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్ బాబులు ఉన్నారు.

ఎండార్స్మెంట్లు, టీడీఆర్ బాండ్లను వేగంగా అందించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఎండార్స్మెంట్లు, టిడిఆర్ బాండ్లను వేగంగా అందించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాలిక, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో విస్తరణ ప్రభావిత భవనాల యజమానులకు ఎండార్స్మెంట్లు, టిడిఆర్ బాండ్లు వేగంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా ఏటి అగ్రహారం మెయిన్ రోడ్ విస్తరణ పనుల వేగవంతంకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఏసిపిలు బాబురావు, అజయ్ కుమార్, డిఈఈ రమేష్ బాబు, టిపిఎస్‌లు, ఏఈ పాల్గొన్నారు.

జగన్‌కు పేదల ఆశీర్వాదం ఉంది..

విశాలాంధ్ర-పెదకూరపాడు : సమస్యలు తెలుసుకొని సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్నకు పేదల ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుందని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకర రావు అన్నారు. ఆ ఆశీర్వాదాలే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేస్తాయన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా జరుగుతున్న నేపథ్యంలో నరసరావుపేటలో పల్నాడు జిల్లా వైసీపీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమను గడప గడపకు పంపించి ప్రతి పేదవాడి సమస్య తెలుసుకున్నారన్నారు. ఇప్పుడు జగనన్న సురక్ష ద్వారా ఆ సమస్యలు తీరుస్తున్నారన్నారు. అందుకే జగనన్న సురక్ష విజయవంతమైందన్నారు. సమస్యలు తీరిన లబ్దిదారుల ఆనందాన్ని కళ్లారా చూస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ వంటి వాటితో ప్రభుత్వాన్ని పేదవాడి ఇంటి ముందుకు తెచ్చి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ ఫలాలు అందించాలన్న తపనతో సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. అలాంటి ముఖ్యమంత్రికి పేదల అండ, ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, జంగా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువు చేస్తే రాజీనామా చేస్తా: బొల్లా

విశాలాంధ్ర-నరసరావుపేట : వినుకొండ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలు తనపై చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఖండించారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ.53 కోట్లు రుణం తీసుకున్నట్లు ప్రచారం చేస్తూ, టీవీల్లో ట్రోలింగులు ఇస్తున్నారని. తనకు ఆ బ్యాంకులో ఖాతా ఉన్నట్లు రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బ్రహ్మనాయుడు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో గురువారం జరిగిన జగనన్న సురక్ష పథకం విజయోత్సవ సమావేశంలో పాల్గొన్న బ్రహ్మనాయుడు విలేకరులతో మాట్లాడుతూ తనపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తీవ్రస్థాయిలో ఖండించారు. కొందరు నాయకులు తనపై బురద తల్లి కార్యక్రమాన్ని చేస్తున్నారని, ఇది వారి నాశనానికి నాంది అవుతుందన్నారు. తన రాజకీయ ఎదుగుదలను వారవలేక మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తనపై బురద జల్లుతున్నారన్నారు. వినుకొండలో మంచినీరు, ప్రభుత్వ ఆసుపత్రి, గురుకుల పాఠశాల, విద్యుత్ సమస్యలను పరిష్కరించామని అన్నారు. తాను 2016లో 200 ఎకరాలు భూమిని కొనుగోలు చేశానని, ఈ విషయంలో ఎలాంటి తేడా వచ్చిన అభియోగం చేసిన వారికి ఆ పొలం రాసిస్తానని అన్నారు. నా కష్టార్జితంతో కొనుగోలు చేసిన పొలంపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేయటం తగదన్నారు.

జగనన్న సురక్షలో గందరగోళం

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి వైసీపీలో మరోసారి వర్గ విభేదాలు బయటపడ్డాయి. నులకపేటలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో వైసీపీ నాయకులు బహాబహికి దిగారు. జనం సాక్షిగా ఒకరిపై ఒకరు తీవ్ర పదజాలంతో వైసీపీకి చెందిన రెండు వర్గాలు దూషణలకు దిగారు. ఒకరికిపై ఒకరు దాడి చేసుకునేందుకు యత్నం చేశారు. తాడేపల్లిలో ఎమ్మెల్యే వర్గానికి, నూతనంగా ఎన్నికైన మంగళగిరి తాడేపల్లి అధ్యక్షులు వర్గం మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. సమయం గడుస్తున్న కార్యక్రమానికి అధికారులు హాజరుకాలేదు. దీనితో ప్రజలు అసహనంతో ప్రశ్నించారు. అధికారులు రాకపోవడంపై ఓ వర్గం పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అడగటానికి నువ్వు ఎవరు అంటూ బహాబహికి దిగారు. రెండు వర్గాల మధ్య పనిచేయలేక దిక్కుతోచని స్థితిలో అధికారులు ఉన్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. జగన్ ఇలాకాలో వైసీపీకి చెందిన ఇరు వర్గాలు కొట్లాట చర్చనీయాంశంగా మారింది. నూతన అధ్యక్షులు ఎన్నుకున్న దగ్గరనుంచి వివాదం ముదురుతుంది. తమపై ఆధిపత్యం చలాయించేందుకు ప్రయత్నిస్తుందంటూ ఎమ్మెల్యే వర్గంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ అధికారం కోసం అహర్నిశలు కష్టపడిన తమకు న్యాయం జరగట్లేదంటూ మంగళగిరి తాడేపల్లి అధ్యక్షుడి వర్గం ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలాగే కొనసాగితే పార్టీకి గుడ్ బై చెప్పేందుకు వైసీపీకి చెందిన ఒక వర్గం సిద్ధంగా ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-అద్దంకి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అర్హత కలిగిన కుటుంబాలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు శాప్‌నెట్ చైర్మన్ నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య తెలిపారు. గురువారం మండలంలోని తిమ్మాయపాలెం, ధర్మవరం గ్రామాలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పథకాలు పంపిణీ చేసి ప్రజా సంక్షేమ ప్రభుత్వంగా సీఎం రాష్ట్రాన్ని తీర్చిదిద్దారన్నారు. గ్రామాలలో పలు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కృష్ణచైతన్య ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, తహశీల్దార్ సుబ్బారెడ్డి, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక పురస్కారాలు అందజేత

విశాలాంధ్ర-పర్చూరు: రోటరీ ఆధ్వర్యంలో నిర్వహించే శుద్ధజల కేంద్రా లలో పనిచేసే వారికి ప్రోత్సాహక పురస్కా రాలు అందిస్తున్నామని రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రోటరీ భవన్‌లో గురువారం పర్చూరు, నూతలపాడు, ఆదిపూడి గ్రామాలలో నిర్వహిస్తున్న శుద్ధజల కేంద్రాలలో సేవలందిస్తున్న వారికి నగదు, నూతన వస్త్రాలను అందించి ఆరోగ్య భీమా సౌకర్యమును కల్పిం చారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదా నందరెడ్డి, సపోర్టు అధ్యక్షులు పోలిశెట్టి చంద్రం, ప్రతినిధులు కోటా శ్రీనివాసరావు, కాసా అశోక్, కొల్లా నరేంద్రకుమార్, పాబోలు వెంకన్న , పాబోలు ఉదయభాస్కర్, కోడూరి సుబ్రహ్మణ్యాచారి ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి, ప్రజలకు భవిష్యత్తు బాగుంటుందని టీడీపీ నాయకులు అన్నారు. చీరాల నియోజక వర్గ తెదేపా ఇంఛార్జి ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు నియోజక వర్గంలోని అక్కాయపాలెం పంచాయతీ మాచర్ల మోహనరావు కాలనీలో మహాశక్తి సభ్యుల బృందంతో కలసి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి తెదేపాతోనే సాధ్యమని ఇంటింటికీ తిరుగుతూ, కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు వివరించారు. మ్యానిఫెస్టోలో రూపొందించిన పథకాలతో మహిళలకు, పేదలకు, సమాజంలోని అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గంజి పురుషోత్తం, కౌతరపు జనార్ధన్ రావు, కొమ్మనబోయిన రజని, సుబ్బలక్ష్మి, రాముడు, పాండు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఫైరింగ్‌లో శ్రీయాదవ్‌కు బంగారు పతకం

విశాలాంధ్ర - చీరాల : 23వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి క్యాడట్స్‌కు నిర్వహిం చిన రాష్ట్ర స్థాయి జూని యర్స్ ఉమెన్స్ ఫైరింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థిని నేహా రామ్ శ్రీ యాదవ్‌ని సెయింట్ ఆన్స్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు, ఎన్‌సిసి సిబ్బంది అభినందించారు. చీరాల సెయింట్ ఆన్స్ స్కూల్ లో 9 వ తరగతి చదువుతున్న నేహా రామ్ శ్రీయాదవ్ ఎన్ సి సిలో శిక్షణ పొందుతున్నారు. ఎన్‌సిసి క్యాండెంట్స్‌కు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఫైరింగ్ జూనియర్స్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఢిల్లీలో జరిగే అల్ ఇండియా ఫైరింగ్ పోటీలకునేహా రామ్ శ్రీ యాదవ్ ఎంపికై విద్యా అభ్యసిస్తున్న పాఠశాలకు,తల్లితండ్రులకు,ఉపాధ్యాయులకు పట్టణానికి మంచి పేరు ప్రతిష్టలు తీసికొని రావాలని పలువురు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయస్సులోనే ఎన్‌సిసిలో అత్యంత ప్రతిభ కనబర్చి ఫైరింగ్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించిందని శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని పెద్దఅంబడిపూడి గ్రామంలో గురువారం ఎంపీపీ స్కూల్లోని విద్యార్థిని విద్యార్థులకు గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐరన్ పోలిక్ మాత్రలు వేసుకోవడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందన్నారు. తద్వారా విద్యార్థులు దృఢత్వంగా ఉంటూ చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థిని విద్యార్థులు శారీరకంగా మానసికంగా ధృడత్వంగా ఉంటేనే విద్యలో రాణించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్పి మేరీ శృతి ఆశ కార్యకర్తలు శివలీల,భారతి స్కూలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్లు అయిన **M/s Muthoot Housing Finance Company Ltd.,Guntur** వారి సూచనల మేరకు యావన్మందికి తెలియ జేయునదేమనగా, నాక్లయింటు వద్దకు బాపట్ల జిల్లా, పర్చూరు(మం), నాగులపాలెం గ్రామ కాపురస్తులు 1) పావులూరి బుజ్జి, పావులూరి బాబూరావు గార్లు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని తనఖాగా వుంచి ఋణము కొరకు సంప్రదించియున్నారు. సదరు ఆస్తి రుద్రపాటి దానమ్మగారికి దఖలు ద.నెం.373/2008గా రిజిష్టరు చేసిన దరిమిలా సంక్రమించి సర్వ హక్కులతో అనుభవించుచూ ఇంటెస్టేటుగా మరణించిన దరిమిలా ఆమె ముఖ్య వారసులైన రుద్రపాటి దాసు, ఏసుపాదం, కిరణ్‌కుమార్, కాకి వసంతరావు గారి భార్య సుభాషిణి మరియు పావులూరి బాబూరావుగారి భార్య బుజ్జి గారలకు సంక్రమించినదని వారందరూ కలసి వ్రాసుకున్న పార్టీషన్ దస్తావేజు నెం.73/2017 రీత్యా బి-షెడ్యూలులో 1వ అయిటం ఆస్తి పావులూరి బుజ్జి గారికి సంక్రమించినదని అట్టి ఆస్తిని ఆమె సర్వ హక్కులతో అనుభవించుచూ ఉన్నంతలో సదరు ఆస్తికి సర్వే నెం. తప్పుగా నమోదు కాబడినందున ది.10-02-2021న సవరణ దస్తావేజు వ్రాయించుకొని దస్తావేజు నెం.265/2021గా పర్చూరు యస్.ఆర్.ఓ.లో రిజిష్టరు చేసుకున్న దరిమిలా బుజ్జి గారికి సంక్రమించి యున్నదని అట్టి ఆస్తిని మరలా విక్రయ ద.నెం.880/2023గా పావులూరి బుజ్జిగారు కొనుగోలుచేసి సర్వ హక్కులతో అనుభవించుచున్నారు. అట్టి ఆస్తికి చెందిన దఖలు దస్తావేజు నెం.373/2008 యస్.ఆర్.ఓ.పర్చూరు గల దస్తావేజు పోయినదని సదరు విషయమై పోలీసు వారికి ఫిర్యాదు చేసి ది.01-07-2023న నాన్ ట్రేసబుల్ సర్టిఫికేట్ నెం.MLD0123003 35303గా పొందియున్నారని అట్టి ఆస్తిని ఋణం కొరకు నాక్లయింటుకు సంప్రదించు యున్నందున ఎవరికైనా షెడ్యూలు దాఖలా ఆస్తిపై గానీ, మంజూరుచేయు ఋణముపైగానీ ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయవలెనని గడువులోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్కళి ఆస్తిగా భావించి లోను మంజూరు చేయబడును ఈగడువు అనంతరమువచ్చు ఆక్షేపణలు, వగైరాలు నాక్లయింటు హక్కులను బైండుచేయబడవు.

షెడ్యూలు:బాపట్లజిల్లా, బాపట్ల రి.డి., పర్చూరు(మం)& సబ్.డి., ఉప్పుటూరు శివారు నాగులపాలెం గ్రామ పంచాయితీ ఏరియా లోని, ఉప్పుటూరు గ్రామ సర్వే నెం.73/5రు, వెనుకబడిన తరగతుల ఏరియాలోని, డోరు.నెం.5-166(1),అసెస్మెంటు నెం.840రు గుర్తుగా గల ఆర్.సి.సి.దాబా యిల్లు స్థలమునకు **హద్దులు.తూర్పు:**పంచాయితీ బజారు హద్దు,అ43లు, **దక్షిణం:** తెలగతోటి ఏసుగారి యిల్లు స్థలంహద్దు, అ.54లు, **పడమర:** చిట్టిమూల ప్రసాద్‌గారి స్థలంహద్దు,అ.43లు,**ఉత్తరం:**పంచాయితీ బజారు హద్దు.అ54లు.యీ హద్దుల మధ్యన గల చ.గ. 258లు స్థలమున్నూ, యీస్థలములో వున్న 600చ.అ.ల ఆర్.సి.సి దాబా యిల్లు యావద్విశిష్టములతో సహా.

శ్రవణ్ త్రిపురమల్లు, B.A., LL.M.
Advocate, D.No.22-11-69, Tripuramallu Complex, Thunuguntlavari Street, Lalapet, Guntur. Cell: 9032457497

అధికారం ఉంది.. అడిగేదెవరు..?

- మంత్రి నాగార్జున ఉండగా నిబంధనలు మాకేలా...!
- గురుకులంలో అమలు కానీ నిబంధనలు
- ప్రిన్సిపాల్, జూనియర్ అసిస్టెంట్లపై విమర్శల వెల్లువ

విశాలాంధ్ర - రేపల్లె : సాంఘీక సంక్షేమ శాఖ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో నిబంధనలకు తిలోదకాలిస్తు ప్రిన్సిపాల్, జూనియర్ అసిస్టెంట్ పోస్టింగ్‌లు ఇచ్చారని పలు ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. కారంపూడిలో పనిచేస్తూ నాడు-నేడు పనుల్లో అవకతవకల ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయన మహిళా ప్రిన్సిపాల్ నియామకం నిబంధనలకు విరుద్ధం అంటున్నారు. మంత్రి మేరుగ నాగార్జున చొరవతో రేపల్లె బాలికల గురుకుల పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్ తెచ్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మంత్రి నాగార్జున అన్న ఉండగా.. మాకు నిబంధనలా.. మమ్మలి అడిగేదెవరు అంటూ ప్రిన్సిపాల్ గిరి కుమారి వ్యాఖ్యాస్త్రాలతో, పరుష పదజాలంతో సిబ్బందిపై విరుచుకు పడుతున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. సాంఘీక సంక్షేమ శాఖ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు సొంత మండలంలో కాకుండా ఇతర మండలంలో పోస్టింగ్ ఇవ్వాలి. ప్రిన్సిపాల్ క్యాడర్ పోస్టులకు సొంత రెవిన్యూ డివిజన్ పరిధిలో కాకుండా వేరే రెవిన్యూ డివిజన్ పరిధిలో పోస్టింగ్ ఇవ్వాలి. అయితే ప్రస్తుతం బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న గిరి కుమారి రేపల్లె డివిజన్‌కు చెందినవారు కావటం విశేషం. ఈమెతో పాటు కాంట్రాక్టు పద్ధతిలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులైన కిషోర్ తను మంత్రి నాగార్జున మేనల్లుడినని చెప్పుకుంటూ బాలికల కళాశాలలో హల్‌చల్ చేస్తున్నాడని సిబ్బంది ఆరోపిస్తున్నారు. అధికారం ఉంటే నిబంధనలతో పనిలేదని సాంఘీక సంక్షేమ శాఖ ఇక్కడ కూడా వ్యవహరించ టాన్ని పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు తప్పు పడుతున్నారు. 50 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పురుష ఉద్యోగులు బాలికల పాఠశాలలో నియమించకూడదనే నిబంధనను ఉల్లంఘించారని ఆరోపించారు. కిషోర్ వయస్సు 40 లోపు ఉండగా అతనిని కాంట్రాక్ట్ పద్ధతిలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమించి బాలికల పాఠశాలలో పోస్టింగ్ ఇవ్వటం ఆక్షేపణీయమన్నారు. గురుకుల పాఠశాలలో 50 సంవత్సరాల వయస్సు పైబడిన పర్మినెంట్ ఉపాధ్యాయులను సైతం బాలుర పాఠశాలలకు బదిలీలపై పంపించారు. ప్రిన్సిపాల్ గిరి కుమారి, కిషోర్ నిజాంపట్నం గురుకుల బాలుర పాఠశాలలో పని చేశారు. అక్కడకూడా పలు ఆరోపణలు రావడంతో మంత్రి చొరవతో నిబంధనలకు తిలోదకాలిచ్చి రేపల్లె గురుకులంలో పోస్టింగులు పొందారు. ఇక్కడ కూడా కిషోర్ తన ఉద్యోగం తాను చేయకుండా ప్రిన్సిపాల్ చెప్పినట్లు చేస్తూ, వైస్ ప్రిన్సిపల్‌లా వ్యవహరిస్తున్నడనే అభియోగం ఇతనిపై ఉంది. ఇప్పటికైనా సాంఘీక సంక్షేమ శాఖ అధికారులు స్పందించి నిబంధనలకు అనుగుణంగా పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలు, వేధింపులకు పాల్పడుతున్న ప్రిన్సిపాల్, కిశోర్లపై విచారణ జరిపించాలని కోరారు.

స్టోర్ రూమ్‌లో సరుకులు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ గిరికుమారి

వంటశాలలో అజమాయిషీ చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కిషోర్

పారదర్శకంగా ఓటర్ల జాబితా : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితాను పారదర్శకంతతో తయారు చేస్తామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2024పై అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సహాయ ఎన్నికల అధికారులతో స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులు, మృతుల తొలగింపులు ప్రక్రియ ఆరోగ్యకరమైన వాతావరణంలో సవరిస్తామని చెప్పారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు అనుసరించి సవరణ జాబితా రూపొందిస్తామన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి ఇంటింటా విచారణ కార్యక్రమం జరుగుతుందన్నారు. వచ్చే సంవత్సరంలో ఎన్నికలు రానున్నందున సమర్థంగా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. ప్రక్రియలో అవాంతరాలు రాకుండా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల విచారణ ఆగస్టు 21వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఆగస్టు 22వ తేదీ నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు జాబితాలోని తప్పులు, పొరపాట్లను పరిశీలిస్తారన్నారు అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరిస్తామని వివరించారు. డిసెంబర్ 26వ తేదీ నాటికి అభ్యంతరాలను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. 2024 సంవత్సరం జనవరి 5వ తేదీన ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అధికారిని కె లక్ష్మీశివజ్యోతి, ఆర్ డి ఓ లు జి.రవీందర్, పార్థసారథి, టిడిపి, వైసీపీ, సిపిఐ, సిపిఎం నాయకులు ఉన్నారు.

25న విద్యారంగ సమస్యలపై రాష్ట్ర బంద్

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 25 వ తేదీన ఏఐఎస్ఎఫ్, టీయస్ఎస్ఎఫ్, ఎస్.యస్. యు.ఐ, పిడిఎస్‌యూ, ఏఐఎస్ఏ, ఏఐడిఎస్ఓ విద్యాసంస్థల బంద్‌కి పిలుపునిస్తున్నామని జిల్లా ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ ముండ్ల జాన్ తెలిపారు. జాన్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను తక్షణమే పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని విరమించుకుని ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని అదే విధంగా హాస్టల్ విద్యార్థులకు పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. కార్పొరేట్ కళాశాలలో, పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల నిధులను తక్షణమే విడుదల చేయాలని డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశపెడుతున్న మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని విరమించు కోవాలన్నారు. విశ్వ విద్యాలయాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. ప్రతి విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ. 200 కోట్లు నిధులు కేటాయి ంచాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకి మెగా డీఎస్సీ విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ సాంఘిక, సంక్షేమ, వెనుకబడిన హాస్టల్స్ మౌలిక వసతులు కల్పిం చాలన్నారు. పరిష్కరించాలని కోరుతూ 25న విద్యా సంస్థల బంద్‌కి పిలుపునిస్తున్నమని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యార్థి సంఘాలు అద్దంకి అధ్యక్షులు కామ్రేడ్ బొజ్జ యేబేలు, ఘని, వినయ్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

శ్మశానాలకు స్థలాలు కేటాయించండి

- స్థలం లేక ఇపురుపాలెం స్ట్రెయిట్ కట్‌లో పుడుస్తున్న వైనం
- కనీస సామాజిక భవనాలు లేని దళిత వాడలు

విశాలాంధ్ర - చీరాల : అభివృద్ధికి ఆమడ దూరంలో చీరాల మండలంలోని తోటవారిపాలెం గ్రామ పంచాయతీ ప్రజలు ఉన్నారు.కనీస వసతులు ఏర్పాటు కూడా లేకుండా శవాన్ని సమాధి చేయాలన్నా సుమారు ఐదు కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది.తోటవారిపాలెం పంచాయతీలోని అంబేద్కర్ నగర్, కృపానగర్, రంగారావుపేట, వీరయ్యనగర్‌లలో అత్యధికంగా దళితులు నివసిస్తున్నారు. అయితే నేటికి దళిత వాడల్లో కమ్యూనిటీ హాల్ కూడా లేదంటే అతిశయోక్తి కాదు. రంగారావు పేట, వీరయ్య నగర్లలో నివసిస్తున్న ప్రజలు గ్రామంలోని మనిషి చనిపోతే దహన,దాన కార్యక్రమాలు చేయడానికి సుమారు వెళ్ళడానికి 2.5 కిలోమీటర్ల దూరం తిరిగి రావడానికి 2.5 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. ఎన్నికలప్పుడు నాయకులు వస్తారు,వెళ్తారు కానీ గ్రామాల అభివృద్ధికి చేస్తున్న చర్యలు మాత్రం సూన్యం.ప్రభుత్వం ప్రత్యేకించి శ్మశాన వాటికలు లేని ప్రాంతాలు గుర్తించి,ప్రభుత్వ భూమి ఉంటే అక్కడి ప్రజలకు కేటాయించాలని,లేకపోతే ప్రయివేటు స్థలాన్ని కొని కేటాయించాలని జీవోఎంఎస్ నంబర్-1235 ఉన్నప్పటికీ గ్రామ స్థాయిలో అధికారులు తీసుకున్న చర్యలు మాత్రం సూన్యం. తోటవారిపాలెం గ్రామ పంచాయతీలో మొత్తం మూడు స్మశాన వాటికలు ఉండగా వాటిలో మాల సామాజిక వర్గం మినహాయించి అన్ని సామాజిక వర్గాల వారికి సర్వే నంబర్775-1లో 4.12 ఎకరాల్లో ఉంది. కానీ ప్రస్తుతం ఆక్రమణలకు గురై ఒక ఎకరం భూమి మాత్రమే ఉంది. సర్వేనంబర్495-2లో1.44సెంట్లు,495-4లో2.42 ఎకరాల్లో తెలగ,రెడ్డి సమాజిక వర్గం వారికి కేటాయించారు. ఇది కూడా ప్రస్తుతం ఆక్రమణలో ఉందని వీటికి చుట్టూ ప్రహరీ గోడలు సైతం లేకపోవడం వలన ఆక్రమణలు నిత్యకృత్యం అయ్యాయి. సర్వేనంబర్760-3లో0.81 ఎకరాల్లో మాల సామాజిక వర్గం వారికి చెందిన స్మశానాలు ఉండగా వీటికి బాట సైతం లేదు చుట్టూ ప్రహరీ కూడా లేదు. ఇవి ఊరికి దూరంగా జాతీయ రహదారి-216కి అనుకోని ఉండడం వలన రంగారావు పేట,వీరయ్య నగర్‌ల ప్రజలకు దూరం పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే బందారు నాగేశ్వరరావు కాలానిలో సుమారు 650 కుటుంబాలు నివాసం ఉంటుండగా ఇక్కడి ప్రజలు ఎవరైనా మరణిస్తే ఇపురుపాలెం స్ట్రెయిట్ కట్ దిక్కయింది. దూరం తీసుకెళ్లలేక స్ట్రెయిట్ కట్ లో పుడుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు గ్రామంలోని వాస్తవ పరిస్థితులను గమనించి ప్రజా శ్రేయస్సు కోరి రంగారావు పేట,వీరయ్య నగర్,బందారు నాగేశ్వరరావు కాలనీల ప్రజలకు దగ్గరలో స్మశాన వాటికల కోసం స్థలం కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

మృతదేహంతో ఐదు కిలో మీటర్లు నడవాలి
- గుమ్మడి చంద్రం రంగరావుపేట

రంగారావు పేట, వీరయ్య నగర్ల ప్రజలు ఎవరైనా చనిపోతే దహన,దాన కార్యక్రమాలకు ఐదు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తుంది రెండు గ్రామాల ప్రజలకు కలిపి కానీ వేరువేరుగా కానీ దగ్గరలో స్థలం కేటాయించాలని కోరుతున్నాము.

ఆరు కిలో మీటర్లు నడవాలి
- బుదాటి శంకర్, బందారు నాగేశ్వరరావు కాలనీ

సుమారు 650 గడప కలిగిన బందారు నాగేశ్వరరావు కాలనీకి దగ్గరలో స్మశాన వాటిక లేదు మేము ఇక్కడ నుంచి దహన కార్యక్రమాలకు వెళ్లాలంటే 6 కిలోమీటర్ల దూరం ఉంటుంది,స్థానిక నాయకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవట్లేదు,ప్రస్తుతం ఇపురుపాలెం స్ట్రెయిట్ కట్ పై దహన సంస్కారాలు పూర్తి చేస్తున్నాము, అధికారులు, ప్రభుత్వ పెద్దలు మాకు దగ్గరలో స్మశాన వాటిక కేటాయించాలని కోరుతున్నాము.

సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి
- గుమ్మడి ఏసురత్నం, ప్రజావేదిక రాష్ట్ర కార్యదర్శి

ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి వీరయ్య నగర్, రంగారావు పేట,బందారు నాగేశ్వరరావు కాలనీలకు స్మశాన వాటికల నిర్మాణనానికి స్థలం కేటాయించాలని, గ్రామాల జనాభా పెరుగుదలతో స్మశానాల కొరత ఏర్పడిందని అన్నారు. శాసనసభ్యుల చొరవతో రోడ్ల నిర్మాణం పూర్తైనప్పటికి కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయలేదని పంచాయతీలో రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయని అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నామన్నారు.

28న 2 లక్షల మొక్కలు నాటాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

విశాలాంధ్ర - బాపట్ల : గ్రీన్ బాపట్ల పేరుతో ఈ నెల 28వ తేదీన జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విస్తారంగా మొక్కలు నాటి బాపట్లను పచ్చదనం చేయాలని చెప్పారు. మొక్కలు నాటడడం ద్వారా వాతావరణ సమతుల్యత పెరుగుతుందన్నారు. మొక్కలతో జిల్లాను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కాలుష్య రహిత బాపట్ల జిల్లాగా రూపు మార్చేందుకు అధికారులంతా సహకరించాలన్నారు. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. రెండు లక్షల మొక్కలు ఒకేరోజు నాటడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వేప, చింత, నేరేడు, మోదుగ, పచ్చ సుంకేసుల, ఎర్ర సుంకేసుల వంటి ఎనిమిది రకాల మొక్కలను అన్ని మండలాలకు చేరవేస్తా మన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ వైద్యశాలలు, ప్రభుత్వ కార్యాలయాలన్నింటి లోనూ ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలని తెలిపారు. ముఖ్యంగా సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ప్రజాప్రతినిధులందరూ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో డ్వామా పిడి వై.శంకర్ నాయక్, జిల్లా అధికారులు, డిఎల్‌డివో లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు, ఏపీడిలు, ఏపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనంలో దివ్యాంగునికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైసీపీ నియోజకవర్గ వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ చేతుల మీదుగా మండలంలోని తోటవారిపాలెం, వీవర్స్ కాలనీకి చెందిన పేద దివ్యాంగుడైన పొట్టేటి సాయికి జైపూర్ పాదములు అమర్చుకొనుటకై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.15 వేల, డా. ఐ బాబూరావు రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. వెంకటేష్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలో రోటరీ క్లబ్, వాకర్స్ అసోసియేషన్ ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, డా.బాబూరావు, పలివేటి మురళీకృష్ణ, పార్వతి, సుభాషిణి, చీమకుర్తి బాలకృష్ణ, చారుగుళ్ళ ప్రసాద్, రవిచంద్ర,డి.వి.సురేష్, శీరాం రమేష్, చింతా రమేష్, బద్రి, వాకర్స్, రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిందితులకు శిక్ష పడితినే బాధితులకు న్యాయం

-ఎస్పీ వకుల్‌జిందాల్



విశాలాంధ్ర - బాపట్ల : నిందితులకు జైలు శిక్ష విధించబడినప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్లునని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మహిళా సంబదిత తీవ్ర నేరాలైన ఫోక్సో, రేప్, మహిళల హత్య కేసులలోని ముద్దాయిలకు కోర్టులో శిక్ష పడేవిధంగా తీసుకోవలసిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు ట్రైల్ మానిటరింగ్ విధానం సత్ఫలితా లను ఇస్తుందన్నారు. కోర్టు కానిస్టేబుల్, కోర్ట్ మానిటరింగ్ సిబ్బందితో ప్రతిరోజు కేసులోనే పురోగతిని తెలుసుకుంటూ ఉండాలన్నారు. కోర్టు వాయిదాలకు ముద్దాయిలు సాక్షులు సక్రమంగా హాజరు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైల్ సమయంలో సాక్షులు సరైన పద్దతిలో జరిగిన నేరాన్ని గురించి కోర్టులో భయం లేకుండా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. సాక్షులు చెప్పే వాంగ్మూలంతో పాటు భౌతిక సాక్షాదారాలు, నిపుణుల నివేదికలను ఒకదానితో ఒకటి క్రోడీకరించి ముద్దాయిలపై మోపబడిన నేరాన్ని కోర్టులో రుజువు చేయాలన్నారు.గంజాయి, రేప్ కేసులో, పోక్సో , హత్య నేరాలలోని నిందితులపై రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేయాలన్నారు, షీట్స్ ఓపెన్ చేసిన ముద్దాయిలు సంబంధిత స్టేషన్ పరిధిలో నివాసం ఉండకుండా వేరొక స్టేషన్ పరిధిలో నివాసముంటుంటే వెంటనే స్టేషన్ అధికారికి తెలిపి షీట్స్ ను బదిలీ చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాలను నియంత్రించడం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతంలో దొంగతనాలకు పాల్పడిన పాత నేరస్థులపై నిఘా ఉంచి, వారి కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఏదైనా నేరానికి పాల్పడినట్లు సమాచార తెలిసిన వెంటనే అదుపులోకి తీసుకొని విచారించాలన్నారు. ప్రతి సర్కిల్ పరిధిలో నియమించిన క్రైమ్ పార్టీలు సమర్ధవంతంగా విధులు నిర్వహించి దొంగతనం కేసులను ఛేదించి దొంగలించబడిన ప్రాపర్టీ ముద్దాయిల వద్ద నుండి రికవరీ చేసి బాధితులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ , రేపల్లె, చీరాల, బాపట్ల డీఎస్పీలు మురళీకృష్ణ, ప్రసాద్ రావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ తదితరులున్నారు

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు: ఎంపీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. గురువారం మండలంలోని అడవులదీవి సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి లబ్దిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు ఆర్థిక స్వాలంబన సాధించే విధంగా సుపరిపాలన సాగిస్తూ జగనన్న ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సాధించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువనాయకులు మోపిదేవి రాజీవ్, వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీ నాజర్ ఖాన్, సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ భాగ్యలక్ష్మి మదన్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య అన్నారు. గురువారం మండలంలోని పల్లపట్ల గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అయన పాల్గొని పలువురికి వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందిం చాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారం భించారని చెప్పారు. గతంలో సాంకేతిక తప్పిదాల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు ఇది ఒక మంచి అవకాశమన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకొని నూరు శాతం సంక్షేమ లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సురేష్, ఎంపీడీవో ఎస్.నాగలక్ష్మి, సర్పంచ్ రత్న ప్రసాద్, ఎంపీటీసీ నాజర్ ఖాన్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనది

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని తహశీల్దార్ కె.నెహ్రూ బాబు అన్నారు. గురువారం నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పొందడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో కానీ ఆఫ్ లైన్‌లో కానీ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమం 'జగనన్న సురక్ష' లక్ష్యం

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని పమిడిపాడు గ్రామ సచివాలయం-2లో తహశీల్దార్ బి.సుశీల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ బాచిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ 11 రకాల ఉచిత సేవలు ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా అందించడానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ లబ్ది ప్రతి ఇంటికి అందించే విషయంలో ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతూ ప్రజలందరి ఆదరాభిమానాలు చూరగొన్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి మస్తాన్‌రావు, వైఎస్ఆర్సిపి నాయకులు రావి శ్రీధర్, మండల స్థాయి అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని దేవినూతల, విజయనగర్ కాలనీ గ్రామ సచివాలయంల పరిధిలో జగనన్న సురక్ష కార్య క్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా చీరాల నియోజక వర్గ వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ హాజరయ్యారు. అర్హులకు ధ్రువ పత్రాలను అందించారు. మాట్లాడుతూ అర్హులైన వారందరికీ దరఖాస్తు చేసుకున్న వెంటనే ప్రభుత్వ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ధ్రువ పత్రాలను అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాజా దెబోరా, తహశీల్దార్ ప్రభాకరరావు, ఎంపీడీఓ నేతాజీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, ఏ పి ఎం సుబ్బారావు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు వెరిఫికేషన్‌లో పాల్గొనాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్లను ఓటర్ల జాబితాలో తమ ఓటును పరిశీలించే నిమిత్తం బూత్ లెవెల్ ఆఫీసర్లు, అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ వెరిఫికేషన్ చేపట్టనున్నారు. ఈ నెల 21 వ తేదీ నుండి జరిగే ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమంలో రాజకీయ పార్టీలు తమ ప్రతినిధులను పంపవచ్చని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాలు ఇవ్వడంతో తహశీల్దార్ కార్యాల యంలోని ఛాంబర్‌లో తహశీల్దార్ ప్రభాకరరావు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాజపా నుండి మేడికొండ భరణీ రావు, తెదేపా నుండి కౌతరపు జనార్ధన్ రావు, జనసేన నుండి గూడూరు శివరామ ప్రసాద్, సిపిఎం నుండి ఎన్ బాబూరావు మిగిలిన పార్టీల నుండి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షణ సైన్యం వార్షికోత్సవం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : రక్షణ సైనం 18వ వార్షికోత్సవం బాపట్లలో గురువారం ఘనంగా నిర్వహించారు. బాపట్ల డివిజన్‌లోని అన్నీ సంఘాల రక్షణ సైన్య సంఘ కాపరులు, సంఘ పెద్దలు, గృహ సమితి సభ్యులు, యవనస్తులు పట్టణంలోని ప్రధాన కూడలి కొత్త బస్టాండ్ దగ్గర నుండి బైకులు కార్లుతో ర్యాలీ నిర్వహించి వీధులలో రక్షణ సైన్యం జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ముఖ్య అతిధులు ఇండియా సెంట్రల్ రాష్ట్రీయ నాయకులు కల్నల్ యాకుబ్ మాసి మాట్లాడారు.